సాక్షి పెద్దపల్లి

బుధవారం । 27 । డిసెంబర్ । 2023



ఆర్‌ఎఫ్‌సీఎల్‌లో మాక్‌డ్రిల్

ఫెర్టిలైజర్‌సిటీ : ఆర్‌ఎఫ్‌సీఎల్‌లో రక్షణ వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా మాక్‌డ్రిల్ నిర్వహించారు.



'కాంట్రాక్టు'కు గుర్తింపేది?

సాక్షి ప్రతినిధి, కరీంనగర్ : సింగరేణిలో పనిచేసే కాంట్రాక్టు కార్మికులు తమకు గుర్తింపు ఇవ్వాలని కోరుతున్నారు. - 8లో

గరిష్టం/కనిష్టం
30.0/14.5

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. గాలిలతో తేమశాతం తగ్గుతుంది. ఉదయం, సాయంత్రం చలితీవ్రత పెరిగే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

వైభవంగా దత్తాత్రేయస్వామి జయంతి



ప్రత్యేక అలంకరణలో దత్తాత్రేయస్వామి

మంథని: పట్టణంలోని దత్తాత్రేయ ఆలయంలో మంగళవారం స్వామివారి జయంతి వైభవంగా నిర్వహించారు. వేకువజామునే స్వామివారి మూలవిరాట్‌కు వేద మంత్రోచ్చారణలతో ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు ఘనంగా నిర్వహించారు. స్వామి వారిని నయనమనోహరంగా పలు రకాల పుష్పాలు, స్వర్ణ ఆభరణాలతో అలంకరించారు. నవరాత్రి ఉత్సవాల సందర్భంగా గురుచరితలు పఠించారు. ఉదయం వేళలో స్వామి వారిని పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు పకడ్బందీ చర్యలు



మాట్లాడుతున్న ఏసీపీ మహేశ్

ఓదెల(రామగుండం): నేరాల నియంత్రణకు పోలీసులు అప్రమత్తంగా ఉండాలని పెద్దపల్లి ఏసీపీ మహేశ్ పోలీసు అధికారులు, సిబ్బందికి సూచించారు. పొత్కపల్లి పోలీస్‌స్టేషన్‌ను మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడారు. 100 డయల్ ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలన్నారు. రోడ్డు భద్రత, సైబర్ నేరాలు, గంజాయి, మత్తుపదార్థాలతో కలిగే దుష్పరిణామాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. రాత్రిపూట గస్తీ ముమ్మరం చేయాలన్నారు. సమస్యాత్మక గ్రామాల్లో కేసుల వివరాల గురించి పోలీసు అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సుల్తానాబాద్ సీఐ జగదీశ్, పొత్కపల్లి ఎస్సై శ్రీధర్ పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే లక్ష్యం



మాట్లాడుతున్న నాయకులు

రామగిరి(మంథని): పేదల సంక్షేమమే లక్ష్యంగా ప్రధాని నరేంద్రమోదీ పాలన సాగిస్తున్నారని బీజేపీ దళిత మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి జాడి బాల్‌రెడ్డి అన్నారు. బుధవారంపేట గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద మంగళవారం నిర్వహించిన వికసిత్ భారత్ సంకల్పయాత్రలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ ఉపకులాల రాష్ట్ర ఉపాధ్యక్షుడు కామర లక్ష్మణ్, నోడల్ దీపక్‌సింగ్, సర్పంచ్ దేవునూరి రజిత, ఏఎస్‌ఎం పి.మాధవి, ఆశ వర్కర్లు కె.భారతి, పి.సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

అయోధ్య అక్షింతలతో శోభాయాత్ర



శోభాయాత్ర నిర్వహిస్తున్న ట్రస్టు సభ్యులు

మంథని: అయోధ్యలో పూజించిన అక్షింతలతో మంథనిలో శోభాయాత్ర నిర్వహించారు. మంగళవారం స్థానిక అయ్యప్ప ఆలయం నుంచి పట్టణ ప్రధాన వీధుల గుండా లక్ష్మీనారాయణస్వామి ఆలయం వరకు శోభాయాత్ర కొనసాగింది. మహిళలు కోలాటం, మంగళహారతులతో స్వాగతం పలికారు. వచ్చే జనవరి 1 నుంచి 15 వరకు ప్రతీ గ్రామంలో ఇంటింటా అక్షింతలు పంపిణీ చేయనున్నట్లు రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు సభ్యులు తెలిపారు. జనవరి 22న అయోధ్యలో బాలరాముని ప్రాణప్రతిష్ఠ అనంతరం అక్షింతలు చల్లుకోవాలని వారు కోరారు. ట్రస్టు మంథని మండల సంయోజక్ కొత్త శ్రీనివాస్, ముత్తారం మండల సంయోజక్ నామని నాగేశ్, జిల్లా సహ సంయోజక్ కనుకుంట్ల స్వామి, సభ్యులు మాడిశెట్టి సురేందర్, సతీశ్, దువ్వ తిరుపతి, గర్రెపల్లి వెంకటేశ్వర్లు, కెక్కర్ల అనిల్, కోరబోయిన రమేశ్, అయ్యప్ప ఆలయ కమిటీ చైర్మన్ వొడ్నాల శ్రీనివాస్, గౌతమేశ్వర ఆలయ కమిటీ చైర్మన్ మేడగోని రాజమౌళిగౌడ్ పాల్గొన్నారు.

'గుర్తింపు' తేలేది నేడే..!

- సర్వసన్నద్ధమైన కార్మిక సంఘాలు
- రహస్య బ్యాలెట్ పద్ధతిన గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు
- మొత్తం 84 పోలింగ్ బూత్‌లు
- పదిచోట్ల ఓట్ల లెక్కింపు కేంద్రాలు
- సర్వం సిద్ధం చేసిన సింగరేణి యాజమాన్యం
- కేంద్ర కార్మిక శాఖ ఆధ్వర్యంలో ఎన్నికల నిర్వహణ

గోదావరిఖని: సుమారు మరో 10గంటల్లో సింగరేణిలో గుర్తింపు కార్మిక సంఘం భవితవ్యం తేలనుంది. సంస్థలో ఏడోసారి గుర్తింపు ఎన్నికలు నిర్వహిస్తున్నారు. రహస్య బ్యాలెట్ పద్ధతిన ఎన్నికల ప్రక్రియ నిర్వహిస్తారు. బుధవారం ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పోలింగ్ కొనసాగుతుంది. రాత్రి 7గంటల నుంచి ఓట్ల లెక్కింపు చేపడతారు ఏరియాల వారీగా ఈ ప్రక్రియ నిర్వహిస్తారు. ఈ ఎన్నికల్లో ఐదు జాతీయ కార్మిక సంఘాలు, టీబీజీకేఎస్, విప్లవ కార్మిక సంఘాలు సహా 13 యూనియన్లు బరిలో నిలిచాయి.

11 ఏరియాలు.. 39వేల మంది ఓటర్లు..

- సింగరేణిలోని మొత్తం 11 ఏరియాల్లో 39,748మంది కార్మికులు తమ ఓటుహక్కు కలిగి ఉన్నారు.
- వీరికోసం సంస్థవ్యాప్తంగా 84పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు.
- మొత్తం 10చోట్ల ఓట్ల లెక్కింపు కేంద్రాలను సిద్ధం చేశారు.
- ఎన్నికలకు పటిష్టమైన పోలీసు బందోబస్తు చేపట్టారు.
- అన్ని ఏరియాలకు ఎన్నికల అధికారులుగా ఇతర రాష్ట్రాలకు చెందిన కార్మిక శాఖ అధికారులను నియమించారు.
- అలాగే మూడు రీజియన్‌లకు ప్రత్యేక పరిశీలకులను నియమించారు.
- గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల నిర్వహణకు సింగరేణి యాజమాన్యం ఏర్పాట్లుచేసింది.



పోలింగ్ నిర్వహణపై సమీక్షిస్తున్న అధికారులు

సింగరేణి వ్యాప్తంగా 84 పోలింగ్ కేంద్రాలు..

- కార్పొరేట్ ఏరియాలో ఐదు, కొత్తగూడెంలో ఆరు, ఇల్లెందులో మూడు మణుగూరులో ఏడు, రామగుండం-1లో 11, రామగుండం-2లో ఆరు, రామగుండం-3లో ఆరు, భూపాల్‌పల్లిలో తొమ్మిది, బెల్లంపల్లిలో ఐదు, మందమర్రిలో 11, శ్రీరాంపూర్‌లో 15 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. పోలింగ్ పూర్తయ్యాక అదేరోజు రాత్రి ఓట్ల లెక్కింపు చేపడతారు. దీనికోసం ప్రత్యేకంగా ఓట్ల లెక్కింపు కేంద్రాలను కార్మిక శాఖ సిద్ధం చేసింది.

పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సిబ్బంది

రామగుండం రీజియన్‌లోని మూడు ఏరియాల్లో డిస్ట్రిబ్యూషన్(ఎన్నికల సామగ్రి పంపిణీ) కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఆర్జీ-1, 2, 3 ఏరియాల్లో కార్మికులు ఓటు వేసేలా 23 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి డి.శ్రీనివాసులు నేతృత్వంలో మూడు ఏరియాలకు ఎన్నికల అధికారులను నియమించారు. ఆయా జీఎంలు చింతల శ్రీనివాస్, ఎల్‌వీ సూర్యనారాయణ, ఎస్.సుధాకర్‌రావు పూర్తిఏర్పాట్లు చేశారు. ఏఎల్‌సీ శ్రవణ్‌కుమార్ ఆర్జీ-2 జీఎం కార్యాలయంలో అధికారులతో మంగళవారం ఎన్నికల నిర్వహణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఏర్పాట్లు తదితర అంశాలపై అధికారులతో కలిసి సమీక్షించారు. ఆర్జీ-2 జీఎం ఎల్‌వీ సూర్యనారాయణతో కలిసి ఎన్నికల సిబ్బందికి పోలింగ్ సామగ్రి పంపిణీ చేశారు. పోలింగ్ సమయంలో తీసుకోవాల్సిన చర్యలపై ప్రొసీడింగ్ అధికారులు, సిబ్బందికి సూచనలు, సలహాలు చేశారు. అనంతరం పోలింగ్ సామగ్రితో ఎన్నికల సిబ్బంది పోలీసు బందోబస్తు మధ్య తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు ప్రత్యేక వాహనాల్లో తరలివెళ్లారు. ఎన్నికలను రామగిరి తహసీల్దార్ రామచంద్రం పర్యవేక్షిస్తున్నారు.



బ్యాలెట్ బాక్సులతో పోలింగ్ కేంద్రాలకు వెళ్తున్న ఎన్నికల సిబ్బంది

సింగరేణి సమాచారం

ఏరియాలు	11
కార్మికుల సంఖ్య	39,748
పోలింగ్ కేంద్రాలు	84
లెక్కింపు కేంద్రాలు	10

రామగుండం రీజియన్‌లో పోలింగ్ కేంద్రాలు, ఓటర్ల వివరాలు

ఏరియా	ఓటర్లు	పోలింగ్ కేంద్రాలు
ఆర్జీ-1	5,384	11
ఆర్జీ-2	3,556	06
ఆర్జీ-3	3,884	06

10 కౌంటింగ్ కేంద్రాలు..

- ఎన్నికలు ముగిశాక ఓట్ల లెక్కింపు చేపట్టేందుకు కేంద్ర కార్మిక శాఖ సర్వం సిద్ధం చేసింది. సంస్థవ్యాప్తంగా ఉన్న 11 ఏరియాలకు సంబంధించిన ఓట్లను 10చోట్ల లెక్కించేందుకు సర్వసన్నద్ధమైంది. కొత్తగూడెం ఏరియాలోని ఓట్లను రుద్రంపూర్ ఆర్సీవోఏ క్లబ్ లెక్కించేందుకు చర్యలు తీసుకుంది.

అదేవిధంగా ఇల్లెందు ఏరియా ఓట్లను ఇల్లెందు ఏరియా కమ్యూనిటీహాల్, మణుగూరు ఏరియాలో పీవీకాలనీ కమ్యూనిటీహాల్, రామగుండం రీజియన్‌లోని ఆర్జీ-1, 2, 3 ఏరియాలకు సంబంధించిన ఓట్లను గోదావరిఖని సెక్టార్-1 కమ్యూనిటీ హాల్, భూపాల్‌పల్లి ఏరియా ఓట్లను కృష్ణకాలనీ మినీఫంక్షన్ హాల్, బెల్లంపల్లి ఏరియాలో గోలేటి టౌన్‌షిప్, సీఈఆర్‌క్లబ్, మందమర్రి ఏరియాకు సంబంధించిన ఓట్లను మందమర్రి సీఈఆర్ క్లబ్, శ్రీరాంపూర్ ఏరియాలోని ఓట్లను సీసీసీ ఎస్‌సీవోఏ క్లబ్, కార్పొరేట్‌లో హెడ్‌ఆఫీస్ న్యూకాన్ఫరెన్స్‌హాల్, కార్పొరేట్ బూత్-5కు సంబంధించిన ఓట్లను సింగరేణి భవన్ మూడో ఫ్లోర్‌లో లెక్కిస్తారు.

కట్టుదిట్టంగా 'ప్రజాపాలన'

- ప్రతీ 100 కుటుంబాలకో కేంద్రం
- రేపటినుంచి జనవరి 6వ తేదీ దాకా గ్రామసభల నిర్వహణ
- కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ వెల్లడి



మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

పెద్దపల్లిరూరల్: జిల్లాలో ఈనెల 28వ తేదీ నుంచి జిల్లావ్యాప్తంగా నిర్వహించే ప్రజాపాలన గ్రామసభలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశామని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ తెలిపారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో అడిషనల్ కలెక్టర్లు అరుణశ్రీ, శ్యామ్ ప్రసాద్‌లాల్‌తో కలిసి ప్రజాపాలన గ్రామసభల నిర్వహణపై మంగళవారం సమీక్షించారు. ఈనెల 28 నుంచి వచ్చే ఏడాది జనవరి 6వ తేదీ దాకా వార్డులు, గ్రామ పంచాయతీల్లో ప్రజల నుంచి మహాలక్ష్మి, రైతుభరోసా, ఇందిరమ్మ ఇళ్లు, గృహజ్యోతి, చేయూత పథకాల కోసం దరఖాస్తులు స్వీకరించాలని సూచించారు. మండలాల పరిధిలో తహసీల్దార్లు, ఎంపీడీవోల ఆధ్వర్యంలో రెండు బృందాలు, రెండువిడతల్లో గ్రామసభలు నిర్వహిస్తాయన్నారు. సమయపాలన పాటిస్తూ అర్జీలు స్వీకరించాలన్నారు. దరఖాస్తులు ఓరోజు ముందుగానే అందించి గ్రామసభకు పూర్తి చేసిన దరఖాస్తులతో వచ్చేలా చూడాలన్నారు. నిరక్షరాస్యులకు పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ, ఆశ వర్కర్లు సహకరించాలని ఆదేశించారు. ప్రజాపాలన సభల్లో కనీస వసతులు కల్పించాలని చెప్పారు. ప్రభుత్వం అందించిన దరఖాస్తులను ఆయా మండలాలు, గ్రామాలకు చేరేలా చూడాలని జెడ్పీ సీఈవో శ్రీనివాస్‌ను ఆదేశించారు. గ్రామసభల నిర్వహణపై డప్పు చాటింపు ద్వారా విస్తృత ప్రచారం చేయాలని అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ అన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులకు తప్పనిసరిగా సమాచారం అందించాలని అడిషనల్ కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌లాల్ అన్నారు. సమావేశంలో మంథని ఆర్డీవో హనుమా నాయక్, జెడ్పీ సీఈవో శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎదురుచూపులేనా?

- ఆరంభమైన యాసంగి సాగు.. అందరికీ అందని రైతుబంధు
- ఇప్పటివరకు 46,293 మంది ఖాతాల్లోనే సొమ్ము జమ

సాక్షి, పెద్దపల్లి: రైతుబంధు సాయం కోసం జిల్లాలోని అన్నదాతలు ఎదురుచూస్తున్నారు. యాసంగి ప్రారంభమై పనులు జోరందుకున్నా.. పెట్టుబడి సాయం అందలేదు. ఎరువులు, విత్తనాల కొనుగోలుతోపాటు ఇతర వ్యవసాయ అవసరాలకు ప్రభుత్వం అందించే నిధులు సమయానికి రాక కర్షకులు ఆందోళన చెందుతున్నారు. సమయానికి పెట్టుబడి డబ్బు చేతికి అందక నిత్యం వ్యవసాయ కార్యాలయాలు, బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు. విడతలు, విస్తీర్ణం వారీగా రైతుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా నగదు జమచేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. అయితే, నిధులు జమకాక, రుణమాఫీపై స్పష్టత లేక బ్యాంకులు కొత్తగా రుణాలు మంజూరు చేయడంలేదు. దీంతో పెట్టుబడికి చేతిలో నగదు లేక రైతులు వడ్డీవ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తోంది.

పాత పద్ధతిలోనే సాయం..

- పంట పెట్టుబడి కోసం కేసీఆర్ ప్రభుత్వం ప్రతీసీజన్‌లో ఎకరాకి రూ.5వేలు అందించింది.
- గత అసెంబ్లీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో రైతుబంధు రైతుల బ్యాంకు ఖాతాల్లో జమకాలేదు.
- అలాగే తాము అధికారంలోకి వస్తే ఎకరాకి రూ.7,500 చొప్పున ఏడాదికి రూ.15వేలు అందిస్తాని కాంగ్రెస్ హామీ ఇచ్చింది.
- అయితే, ఎక్కువ విస్తీర్ణం భూమి ఉన్న రైతులకు రైతుబంధు ఇవ్వకుండా, అర్హులైన వారికే పథకం అమలు చేయాలనుకుంది.
- సాగు పనులు జోరందుకున్న నేపథ్యంలో పాత పద్ధతిలోనే ఎకరాకి రూ.5వేల చొప్పున ఇస్తామని చెప్పి ఈనెల 10నుంచి బ్యాంకు ఖాతాల్లో డబ్బు జమ చేయడం ప్రారంభించింది.
- జిల్లావ్యాప్తంగా ఇప్పటివరకు కేవలం 46,293మంది అన్నదాతల బ్యాంకు ఖాతాల్లో రూ.10కోట్లు జమచేసింది.
- ఒకగుంట నుంచి ప్రారంభించి.. కేవలం 30గుంటల లోపు వ్యవసాయ భూమి ఉన్న వారికి నగదు జమచేసినట్లు తెలుస్తోంది.



రైతుబంధు వివరాలు

రైతులు	1,55,496
పంపిణీ చేయాల్సిన నగదు(రూ.కోట్లలో)	139.063
సాయం అందినవారు	46,293
పొందిన నగదు(రూ.కోట్లలో)	10.287
ఇంకా అందాల్సిన రైతులు	1,09,203

విస్తీర్ణం ప్రకారం రైతులు

ఎకరం లోపు భూమి ఉన్న వారు	67698
2.5లోపు భూమి ఉన్నవారు	51240
5ఎకరాల్లోపు ఉన్నవారు	29202
10ఎకరాల్లోపు ఉన్నవారు	6527
25ఎకరాల్లోపు ఉన్నవారు	789
25ఎకరాలు, ఆపై ఉన్నవారు	40

ఆందోళనలో అన్నదాతలు

- రైతుబంధు నిధులు ఇప్పటివరకు ఎకరం లోపు విస్తీర్ణం ఉన్న రైతుల బ్యాంకు ఖాతాల్లోనే జమకావడంతో ఆ పైవిస్తీర్ణం ఉన్నవారు ఆందోళన చెందుతున్నారు. ఐదెకరాలకన్నా ఎక్కువ విస్తీర్ణం కలిగిన జిల్లాలోని అన్నదాతలకు ప్రభుత్వం పెట్టుబడి సాయం నిలిపివేస్తుందనే వదంతులతో ఆందోళన చెందుతున్నారు.

ఖాతాలో పడలేదు

నాకు రెండు ఎకరాలు ఉంది. గతంలో నాటు వేసే ముందే రైతుబంధు వచ్చేది. ఆ సొమ్ముతోనే విత్తనాలు, యూరియా, కూలీలు, దున్నుడు పనులు చేసుకున్న. ఇప్పుడు రైతుబంధు కోసం ఎదురుచూస్తున్న.



- ఖఫూర్, రైతు, పందిళ్ల, కాల్వశ్రీరాంపూర్

విడతల వారీగా జమ

యాసంగిలో రైతుబంధు డబ్బును ప్రభుత్వం విడతల వారీగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమచేస్తున్నది. జిల్లాలో ఇప్పటివరకు 46,293మంది ఖాతాల్లో రూ.10కోట్లు జమచేసింది. ప్రభుత్వం ప్రత్యేకంగా ఎటువంటి నిబంధనలు విధించలేదు. విడతల వారీగా పాత పద్ధతిలోనే పెట్టుబడి సాయం అందుతుంది.



- ఆదిరెడ్డి, డీఏవో

ప్రజాపాలన వార్డుసభలు ఇలా..

- 28 నుంచి దరఖాస్తుల స్వీకరణ
- రోజూ ఎనిమిది డివిజన్లలో సభలు

కోల్‌సిటీ(రామగుండం): రామగుండం నగరపాలక సంస్థ పరిధిలో ఈనెల 28 నుంచి ప్రజాపాలన వార్డు సభల నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. నగరంలోని 50 డివిజన్లలో చేపట్టే సభల గురించి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ నాగేశ్వర్ మంగళవారం వెల్లడించారు. ఈనెల 28 నుంచి జనవరి 6వ తేదీ వరకు ప్రజాపాలన వార్డు సభలు నిర్వహిస్తామన్నారు. మహాలక్ష్మి, రైతు భరోసా, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇళ్లు, చేయూత పథకాల కోసం ఇందులో అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఉదయం 8- మధ్యాహ్నం 12 గంటల వరకు నాలుగు డివిజన్ల, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు మరో నాలుగు డివిజన్లలో సభలు నిర్వహించనున్నట్లు వివరించారు. స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొంటారని అన్నారు. సభలో సమర్పించే దరఖాస్తు ఫారాలను ముందుగానే ఏరియా బిల్‌కలెక్టర్, మహిళా సంఘం ఆర్పీలు ఉచితంగా అందిస్తారని తెలిపారు. వాటిని పూరించి ఆధార్, రేషన్‌కార్డు జిరాక్స్‌లను జతచేసి వార్డు సభలో అధికారులకు అందజేయాలని సూచించారు.

సభల నిర్వహణ డివిజన్ల వారీగా ఇలా..

తేదీ	ఉ.8 - మ.12	మ.2 - సా.6
28	1, 2, 3, 36	5, 6, 7, 8
29	9, 10, 11, 12	13, 14, 15, 16
30	17, 18, 19, 20	21, 22, 23, 24
02	25, 26, 27, 28	29, 30, 31, 32
03	33, 34, 35	37, 38, 39, 40
04	41, 42, 43, 44	45, 46, 47, 48
05	49, 50, 04	--

(గమనిక ఉ : ఉదయం, మ : మధ్యాహ్నం, సా : సాయంత్రం అని చదువుకోగలరు)

పాత్రికేయులకు ఇళ్ల స్థలాలు ఇప్పిస్తాం

- రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్



మాట్లాడుతున్న రాజ్‌ఠాకూర్

గోదావరిఖని: పాత్రికేయులకు ఇళ్ల స్థలాలు ఇప్పించేందుకు కృషి చేస్తానని రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్ హామీ ఇచ్చారు. మంగళవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఎమ్మెల్యేకు ఆత్మీయ సన్మానం నిర్వహించారు. ప్రజాసమస్యలను వెలుగులోకి తీసుకువచ్చే సామాజిక బాధ్యత జర్నలిస్టులదే అన్నారు. కత్తి కన్నా కలం గొప్పదని, నిజాలను నిగ్గు తేల్చాలంటే విలేకరులతోనే సాధ్యమన్నారు. ఆర్థిక పరిస్థితులు సహకరించకున్నా సమాజంలో అనునిత్యం జరుగుతున్న సమస్యలను వెలుగులోకి తీసుకువస్తూ ప్రజాసమస్యలపై పరోక్షంగా పోరాటం చేస్తున్నారని అన్నారు. గత పాలకుల నిర్లక్ష్యంతో కనీసం ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాలు విలేకరులకు అందలేదని తెలిపారు. త్వరలోనే విలేకరులకు ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాల ఆధారంగా ఇళ్లస్థలాలు ఇప్పిస్తామని పేర్కొన్నారు. క్లబ్ అభివృద్ధి, సభ్యుల సంక్షేమానికి ప్రభుత్వ పరంగా సహరిస్తామని చెప్పారు. సమావేశంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు పూదరి కుమార్, ప్రధాన కార్యదర్శి పందిళ్ల శ్యాంసుందర్, కోశాధికారి గడ్డం శ్యామ్, సీనియర్ జర్నలిస్టులు వేల్పుల నారాయణ, జక్కం మారుతి, కోల లక్ష్మణ్, వంశీ పాల్గొన్నారు.



నిన్న : కలెక్టరేట్ భవన స్వాగత తోరణం



నేడు : రంగులతో ముస్తాబు









గోడలపై అద్భుత చిత్రాలు వేస్తున్న కళాకారులు

స్వాగత తోరణం.. ఆహ్లాద భరితం

కలెక్టరేట్ భవన సముదాయంలోకి వెళ్లే సందర్శకులను స్వాగత తోరణం విశేషంగా ఆకట్టుకుంటోంది. ఆహ్లాదం పంచేలా స్వాగత తోరణం ఉండాలనే కలెక్టర్ సూచనలతో అధికారులు అద్భుత కళాఖండాలతో రూపుదిద్దుతున్నారు. దానిపై రూపొందిస్తున్న ఆకట్టుకునే నంది, అన్నదాత బొమ్మలు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. బీఆర్‌ఎస్ ప్రభుత్వం మారగానే స్వాగత తోరణం రంగులు కూడా మారుతున్నాయనే దానికి ఇదే నిదర్శనమని సందర్శకులు వ్యాఖ్యానిస్తున్నారు.

- సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి

క్లుప్తంగా

పోలింగ్ కేంద్రాల పరిశీలన



ఏర్పాట్లు పరిశీలిస్తున్న అధికారులు

గోదావరిఖని: సింగరేణిలో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల కోసం ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని ఎన్నికల అధికారులు మంగళవారం సందర్శించారు. ప్రశాంతమైన వాతావరణంలో ఓటింగ్ కొనసాగేలా అన్ని చర్యలు తీసుకోవాలి అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఆర్జీ–2 జీఎం ఎల్వీ సూర్యనారాయణ, ఆఫీస్ ఆన్ స్పెషల్ డ్యూటీ అధికారి ప్రమోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీకి టీబీజీకేఎస్ మద్దతు

గోదావరిఖని: గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో ఏఐటీయూసీకి తమ యూనియన్ ఆర్జీ–1 ఏరియాలో మద్దతు ప్రకటిస్తున్నట్లు టీబీజీకేఎస్ నాయకులు నూనె కొమురయ్య, గండ్ర దామోదర్‌రావు, వడ్డేపల్లి శంకర్ తెలిపారు. మంగళవారం స్థానిక ప్రధాన చౌరస్తాలోని యూనియన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఈవిషయాన్ని వెల్లడించారు. ఈమేరకు ఏకగ్రీవంగా తీర్మానించినట్లు పేర్కొన్నారు. ఏఐటీయూసీ విజ్ఞప్తి మేరకు ఈనిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. సమావేశంలో నాయకులు పర్లపెల్లి రవి, దూత శేషగిరి, కుషనపెల్లి శంకర్, ఎం.రాజేశం, మల్లారెడ్డి, చెల్పూరి సతీశ్, చెలుకలపెల్లి శ్రీనివాస్, నేరెళ్ల సదయ్య, దొరగాండ్ల మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

గుండి సబ్‌స్టేషన్ ఆపరేటర్ సస్పెన్షన్

రామడుగు(చొప్పదండి): మండలంలోని గుండి విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఆపరేటర్‌గా పనిచేస్తున్న ఎ.వినయ్‌కుమార్ మద్యం సేవించి విధులకు హాజరైనందున విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులు ఆయనను సస్పెండ్ చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 24న వినయ్‌కుమార్ మద్యం సేవించి విధులు నిర్వహిస్తున్నాడనే సమాచారం అందుకున్న అధికారులు బ్రీత్ అనలైజర్‌తో టెస్టు చేశారు. మద్యం సేవించినట్లు రికార్డు కావడంతో నివేదికను ఉన్నతాధికారులకు పంపించారు. విచారణ చేసిన డీఈఈ సస్పెండ్ ఉత్తర్వులు జారీ చేశారు.

సెల్ పాయింట్‌లో చోరీ



ఘటనాస్థలిని పరిశీలిస్తున్న పోలీసులు

జగిత్యాల క్రైం: జిల్లా కేంద్రంలోని అంగడి బజార్‌లో గల ఓ సెల్ పాయింట్‌లో దుండగులు చోరీకి పాల్పడ్డారు. వివరాల్లోకి వెళ్తే.. సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు శ్రీరాజరాజేశ్వర సెల్ పాయింట్ తాళాలు పగులగొట్టి, షాపులో ఉన్న సుమారు రూ.10 వేల విలువైన వస్తువులు ఎత్తుకెళ్లారు. మంగళవారం ఉదయం దుకాణం వద్దకు వచ్చిన యజమాని చోరీ జరిగినట్లు నిర్ధారించుకొని, పోలీసులకు సమాచారం ఇచ్చాడు. వారు ఘటనాస్థలికి చేరుకొని వివరాలు సేకరించారు.

తాళం వేసిన ఇంట్లో..

కోనరావుపేట(వేములవాడ): మండలంలోని ధర్మారంలో తాళం వేసి ఉన్న ఇంట్లో దొంగలు చోరీకి పాల్పడ్డారు. గ్రామానికి చెందిన గుర్రం అంజయ్య తన కుటుంబసభ్యులతో కలిసి ఈ నెల 21న తిరుపతి వెళ్లాడు. మంగళవారం ఉదయం ఇంటికి చేరుకోగా ఇంటికి వేసిన తాళం పగులగొట్టి ఉంది. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా పగులగొట్టి, ఇల్లంతా చిందరవందరగా ఉంది. వెంటనే కోనరావుపేట పోలీసులకు ఫోన్ చేయగా ఎస్సై ఆంజనేయులు, ఏఎస్సై రఘుపతిరెడ్డి చేరుకుని ఘటనాస్థలాన్ని పరిశీలించారు.

'కాంట్రాక్టు'కు గుర్తింపేది?

- చాలీచాలని వేతనాలతో ఇబ్బందులు
- అందని హైపవర్ కమిటీ వేతనాలు
- విద్య, వైద్యం, కనీస సౌకర్యాలు కరువు
- పర్మినెంట్‌తోపాటు మాకూ ఎన్నికలు నిర్వహించాలి
- సింగరేణిలోని కాంట్రాక్టు కార్మికుల డిమాండ్
- నేడు సింగరేణి ఎన్నికలు



కన్వేయర్ బెల్ట్ వద్ద పనులు చేస్తున్న కాంట్రాక్టు కార్మికులు(ఫైల్)

సాక్షిప్రతినిధి, కరీంనగర్: పర్మినెంట్ కార్మికులకు ఎన్నికలు నిర్వహిస్తున్నారు.. మరి కాంట్రాక్టు కార్మికుల సంగతేంది?.. మా బాధలు ఎవరికి చెప్పుకోవాలి.. కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేస్తాం.. పర్మినెంట్ కార్మికులతో సమానంగా వేతనాలు వచ్చేలా చూస్తాం.. సంస్థ లాభాల్లో కీలక పాత్ర పోషిస్తున్న మిమ్మల్ని గుర్తించేలా చూస్తామని గత పాలకుల హామీలు నీటిమూటలయ్యాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జాతీయ సంఘాలు పట్టించుకోవు.. కాంట్రాక్టు కార్మిక సంఘాలను యాజమాన్యం లెక్కలోకి తీసుకోదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంస్థవ్యాప్తంగా సుమారు 35వేల మంది కాంట్రాక్టు కార్మికులు పలు విభాగాల్లో పనిచేస్తున్నారు. గత ప్రభుత్వాలు వారిని పర్మినెంట్ చేస్తామని చెప్పి మోసగించాయని వాపోతున్నారు. ఈసారైనా పలు యూనియన్లు తమకు మద్దతు పలికి తమ సమస్యలకు చట్టబద్ధత కల్పించాలని కోరుతున్నారు. నేడు సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల సందర్భంగా కాంట్రాక్టు కార్మికుల దయనీయ స్థితిగతులు ఇకనైనా మారాలని కార్మిక సంఘాల నేతలూ ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ఏళ్లుగా పనిచేస్తున్నా ఉద్యోగ భద్రత కరువు..

- సింగరేణిలో ఏళ్లుగా పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు ఉద్యోగ భద్రత కరువైంది.
- శ్రమకు తగిన వేతనం లేదు. బారెడు పనికి జానెడు జీతాలు.. ఇలా కాంట్రాక్టు కార్మికులు శ్రమదోపిడీకి గురవుతున్నారు.
- కోలిండియాలోని కాంట్రాక్టు కార్మికులకు హైపవర్ వేతనాలు అమలు చేస్తున్నా.. సింగరేణిలో ఆ ఊసేలేదు.
- ఆందోళనలు చేసినా సమస్యలు పరిష్కారం కావడం లేదు.
- సంస్థ విస్తరించి ఉన్న ఆరుజిల్లాల్లో సుమారు 35వేల మంది పనిచేస్తున్నారు.
- భూగర్భగనుల్లో మొదలుకుని సివిక్, సివిల్, బెల్ట్‌క్లీనింగ్, ఓబీ, తోటమాలి, ఆస్పత్రులు తదితర విభాగాల్లో కాంట్రాక్టు కార్మికుల పని కీలకంగా మారింది.
- గతంలో కన్నా ఇప్పుడు వీరిసంఖ్య భారీగా పెరిగింది.
- సంస్థలో పర్మినెంట్ ఉద్యోగులు 42 వేల మంది ఉండగా, కాంట్రాక్టు కార్మికులు సుమారు 35వేల మంది పనిచేస్తున్నారు.
- సమస్యలు తలెత్తితే తమ తరఫున మాట్లాడే కార్మిక సంఘాలు కరవయ్యాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- సమస్యలను యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి చర్చించేందుకు తమకూ గుర్తింపు యూనియన్ ఉండాల్సిందేనని స్పష్టం చేస్తున్నారు.

సమస్యలు ఎవరికి చెప్పుకోవాలి..?

పర్మినెంట్ కార్మికులతో సమానంగా పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల సమస్యల పరిష్కారం విషయంలో యాజమాన్యం తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తోందని వాపోతున్నారు. పర్మినెంట్ కార్మికులకు సమస్యలు తలెత్తితే గుర్తింపు, ప్రాతినిధ్య, జాతీయ సంఘాలు రంగంలోకి దిగి యాజమాన్యంతో చర్చించి చట్టబద్ధంగా హక్కులు సాధించుకుంటున్నాయి. అదే కాంట్రాక్టు కార్మికుల సమస్యలను చర్చించి చట్టబద్ధత తీసుకొచ్చేందుకు పెద్దదిక్కు లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేశోరాం సిమెంట్ ఫ్యాక్టరీ మాదిరిగా సింగరేణిలోనూ కాంట్రాక్టు కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఎన్నికల్లో తమకు ఓటుహక్కు కల్పించాలని, లేనిపక్షంలో ప్రత్యేకంగా ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నారు.

హక్కులు పరిరక్షించాలి



సింగరేణిలోని కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనాలు అమలు కావడం లేదు. కోల్ ఇండియా వేతనాలు లేదా జీవో నెం.22ను ఎవరూ పట్టించుకోవడంలేదు. పలు ఘటనల్లో కాంట్రాక్టు కార్మికులు ప్రాణాలు కోల్పోతున్నారు. గాయపడి వికలాంగులుగా మారుతున్నారు. అందుకే, కాంట్రాక్టు కార్మికుల ఆరోగ్యం, కుటుంబ సంక్షేమానికి సింగరేణి చొరవ తీసుకోవాలి. వారిహక్కులను కాపాడేందుకు ఎన్నికలు నిర్వహించాలి.

– కె.విశ్వనాథ్, సింగరేణి కాలరీస్ కాంట్రాక్టు యూనియన్ నేత(ఐఎఫ్‌టీయూ)

కనీస వసతులు లేవు



సింగరేణి గుర్తింపు ఎన్నికల్లో కాంట్రాక్టు కార్మికులకు కూడా ఓటుహక్కు కల్పించాలని మా యూనియన్ ఆధ్వర్యంలో అనేకఉద్యమాలు చేశాం. కనీస వేతనాలులేక, అరకొర వసతులతో అనేక ఏళ్లుగా కాంట్రాక్టు కార్మికులు పనులు చేస్తున్నారు. వీరిసమస్యలు వెంటనే పరిష్కరించాలి.

– వేల్పుల కుమారస్వామి, రాష్ట్ర కార్యదర్శి, సింగరేణి కాంట్రాక్ట్ కార్మిక సంఘం

డిమాండ్‌లు ఇవే..

- కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలి
- కోలిండియా వేతనాలు లేదా జీవో నంబర్ 22 అమలు చేయాలి
- ఖాళీ క్వార్టర్లు కేటాయించాలి
- ఓబీలతో సహా అన్నింటిలోనూ స్థానికులకే అవకాశం కల్పించాలి
- లాభాల వాటా లేదా 20శాతం బోనస్ ఇవ్వాలి
- కుటుంబీలకు వైద్య సదుపాయం కల్పించాలి
- 26–09–22న జరిగిన ఒప్పందాన్ని అమలు చేయాలి
- సింగరేణి ఎన్నికల్లో ఓటుహక్కు కల్పించాలి
- క్యాటగిరీ ఆధారంగా వేతనాలు చెల్లించాలి
- సీఎంపీఎఫ్, కనీస వేతనాలు అమలు చేయాలి
- అన్ని విభాగాల కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలి
- ఈ దిశగా కార్మిక సంఘాలు, అధికారులు తగిన చర్యలు తీసుకోవాలి.

వనరుల దోపిడీని అడ్డుకుంటాం

- పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు



చెక్కులు అందిస్తున్న విజయరమణారావు

సుల్తానాబాద్(పెద్దపల్లి): నియోజకవర్గంలో సహజవనరుల దోపిడీని అడ్డుకుంటామని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. స్థానిక ఆర్యవైశ్య భవనంలో 116 మందికి మంగళవారం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేసి మాట్లాడారు. మానేరు నుంచి ఇసుక తరలించడం ద్వారా భూగర్భ జలాలు అడుగంటి సాగునీరు అందక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటారని, పరిమితికి మించి ఇసుక లోడ్‌తో వెళ్తున్న లారీతో రోడ్లు దెబ్బతింటున్నాయని, దుమ్ము, ధూళితో ప్రజలు, వ్యాపారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తన దృష్టికి తీసుకొచ్చారని అన్నారు. గతపాలకులు ప్రజలను దోపిడీ చేశారని, పోలీసులను అడ్డం పెట్టుకొని కప్పం వసూలు చేశారని ఆరోపించారు. చెరువుల్లో పూడిక తీస్తే సమీప బావుల్లో భూగర్భ జలాలు పెరుగుతాయని రైతులు భావించారని, కానీ కొందరు ప్రజాప్రతినిధులు దానిని సొమ్ము చేసుకున్నారని ధ్వజమెత్తారు. అత్యధికంగా రైస్‌మిల్లులు ఉన్న ప్రాంతం సుల్తానాబాద్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కోతల పేరిట రైతులను ముంచారని, ఇకనుంచి అలా జరగడానికి వీలులేదన్నారు. కచ్చితంగా ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని తెలిపారు. ఇందుకోసం ఈనెల 28 నుంచి నిర్వహించే గ్రామసభల ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తామని చెప్పారు. ఇందుకోసం ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్‌తో కరీంనగర్‌లో బుధవారం సమీక్షిస్తామని అన్నారు. తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్, జెడ్పీటీసీ మినుపాల స్వరూప, సింగల్‌విండో చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. కాగా, నియోజకవర్గంలోని పంచాయతీ కార్యదర్శులు ఎమ్మెల్యేను కలిసి పుష్పగుచ్ఛం అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు నిస్సాంత్‌రావు, శంకర్, రవి, మహేందర్, కిరణ్, పాపయ్య పాల్గొన్నారు.

డ్రా చేయలే.. ఎవరికీ పంపలే

- బ్యాంకు ఖాతా నుంచి రూ.8,500 జీబీటీ ముంబయికి బదిలీ
- తిరిగి ఇప్పించాలని బాధితుడి వేడుకోలు



బాధితుడు రవి

జూలపల్లి(పెద్దపల్లి): డ్రా చేయలే.. ఎవరికీ పంపలే.. అయినా ఓ వ్యక్తి బ్యాంకు ఖాతా నుంచి డబ్బులు మరో అకౌంట్‌కు బదిలీ అయ్యాయి. బాధితుడి వివరాల ప్రకారం.. జూలపల్లి మండలంలోని కాచాపూర్‌కు చెందిన దీకొండ రవి గ్రామంలో కిరాణా దుకాణం నిర్వహిస్తున్నాడు. ఇతనికి పెద్దపల్లిలోని ఎస్‌బీఐ శాఖలో సేవింగ్స్ అకౌంట్ ఉంది. ఖాతాలో రూ.8,574.46 ఈ నెల 24 వరకు ఉన్నాయి. 25న కరీంనగర్ వెళ్లి, సామగ్రి తెచ్చుకుందామని అకౌంట్ చెక్ చేయగా రూ.74.46 చూపించాయి. మంగళవారం బ్యాంకుకు వెళ్లి, ప్రింట్ తీయించగా అతని ఖాతా నుంచి డీపీయూ రూరల్ బ్యాంకింగ్ జీబీటీ ముంబయికి రూ.8,500 బదిలీ అయ్యాయని వచ్చింది. దీంతో రవి వెంటనే సైబర్ క్రైం పోలీసులకు ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేశాడు. సంబంధిత కాపీ, బ్యాంకు ఖాతా పుస్తకంపై వచ్చిన ప్రింట్‌ను జూలపల్లి పోలీసులకు అందజేశాడు. అనంతరం మాట్లాడుతూ.. తాను ఎక్కడా వేలిముద్ర వేయలేదని, ఓటీపీ కూడా ఎవరూ అడగలేదని తెలిపాడు. అయినా, ఖాతా నుంచి డబ్బులు బదిలీ అయ్యాయని వాపోయాడు. సైబర్ నేరగాళ్లు బ్యాంకు ఖాతాల నుంచి డబ్బులు మాయం చేస్తారని ఎందరికో చెప్పే తనకే ఇలా జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. డబ్బులు తిరిగి ఇప్పించాలని పోలీసులను వేడుకున్నాడు.

పందులను ఎత్తుకెళ్లిన ఆరుగురి అరెస్టు

సుల్తానాబాద్‌రూరల్: పందులను ఎత్తుకెళ్లిన కేసులో ఆరుగురిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ విజేందర్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. సుల్తానాబాద్ మున్సిపల్ పరిధిలోని పూసాల రోడ్డులో నివాసం ఉంటున్న రెవెల్లి ఎల్లయ్య పందులను పెంచుకుంటూ ఉపాధి పొందుతున్నాడు. మొత్తం 22 జీవాలకు కామధేనువు రైస్‌మిల్లు పక్కన చెట్ల పొదల్లో పాక ఏర్పాటు చేశాడు. గత దసరాకు ముందు దాదాపు రూ.1.50 లక్షలు విలువైన పందులను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. నిందితులు సుల్తానాబాద్ మున్సిపల్ పరిధిలోని శాస్త్రీనగర్, ఓదెల మండలంలోని మడక, ఎలిగేడు మండలంలోని వడ్కాపూర్‌కు చెందిన ఈరయ్య, శివాజీ, రాకేశ్, శివాజీ, సునీల్, రాజయ్యలను మంగళవారం అరెస్టు చేశారు. వారిని కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

దోపిడీ రహిత సమాజానికి కృషి

- సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి
- ఘనంగా పార్టీ ఆవిర్భావ వేడుకలు



జెండా ఎగురవేసిన వెంకటస్వామి, నాయకులు

కరీంనగర్: దోపిడీ రహిత సమాజం కోసం సీపీఐ కృషి చేస్తోందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి అన్నారు. సీపీఐ 99వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం కరీంనగర్‌లోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 1925 డిసెంబర్ 26న కాన్పూర్‌లో సీపీఐ ఆవిర్భవించిందని తెలిపారు. దేశ స్వాతంత్య్ర ఉద్యమంలో తమ పార్టీ అగ్రనాయకులు ప్రత్యక్షంగా పాల్గొని, జైలుపాలయ్యారని పేర్కొన్నారు. స్వాతంత్య్రం సిద్ధించిన తర్వాత సీపీఐ అనేక నిర్బంధాలను ఎదుర్కొందని, అనేక కార్మిక, ప్రజా ఉద్యమాలు నిర్వహించి విజయాలు సాధించిందని అన్నారు. దేశ ప్రజలను కులాలు, మతాలవారీగా విభజించి పరిపాలిస్తున్న బీజేపీ, ఎన్‌డీఏకు వ్యతిరేకంగా సీపీఐ శ్రేణులు ప్రజోద్యమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. పార్టీ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి, సహాయ కార్యదర్శి కిన్నెర మల్లవ్వ, పైడిపెల్లి రాజు, జిల్లా కౌన్సిల్ సభ్యులు కటికరెడ్డి బుచ్చన్న యాదవ్, నలువాల సదానందం, బూడిద సదాశివ, బోనగిరి మహేందర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య



చుక్కారెడ్డి మృతదేహం

వెల్గటూర్(ధర్మపురి): ఎండపల్లి మండలంలోని గొడిశెలపేటకు చెందిన వన్నెల చుక్కారెడ్డి(52) ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల వివరాల ప్రకారం.. చుక్కారెడ్డి ఐదేళ్లుగా కడుపునొప్పితో బాధ పడుతున్నాడు. ఎన్ని ఆస్పత్రులకు వెళ్లి, మందులు వాడినా ఫలితం లేకపోయింది. ఈ క్రమంలో సోమవారం రాత్రి మరోసారి కడుపునొప్పి రావడంతో భరించలేక క్రిమిసంహారక మందు తాగాడు. కుటుంబసభ్యులు కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. కడుపునొప్పి వల్లే జీవితం విరక్తి చెంది, ఆత్మహత్య చేసుకున్నట్లు మృతుడి భార్య పద్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

వెంకటయ్య బావి నవల ఆవిష్కరణ



హైదరాబాద్: వెంకటయ్య బావి నవలతో సాహిత్యంలో మూడు ప్రక్రియల్లో దాసరి మోహన్ సాధన చేస్తున్నారని నందిని సిధారెడ్డి అన్నారు. తెలంగాణ రచయితల సంఘం జంట నగరాల శాఖ అధ్వర్యంలో మంగళవారం రవీంద్రభారతిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన నవలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దండెం, అల్మారా కవితల సంపుటి, రాళ్ల కుచ్చె కథా సంపుటి రచించిన దాసరి సరికొత్త ఆవిష్కరణలు చేస్తున్నారన్నారు. మోహన్ తన నవలను అక్షర కౌముది సంస్థకు అంకితం చేయడం అభినందనీయమన్నారు. జంట నగరాల అధ్యక్షుడు కందుకూరి శ్రీరాములు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రముఖ రచయిత రూప్ కుమార్ డబ్బీ కార్ పుస్తక పరిచయం చేశారు. కాంచనపల్లి గోవర్ధనరావు, పొత్తూరి సుబ్బారావు, తెలంగాణ రచయితల సంఘం అధ్యక్షుడు నాళేశ్వరం శంకరం, రమాదేవి కులకర్ణి, బెల్లంకొండ సంపత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

టిప్పర్లను అడ్డుకున్న పెద్దూరుపల్లె గ్రామస్తులు

- రాత్రివేళల్లో పనులు నిలిపివేయాలని డిమాండ్



లారీలను అడ్డుకున్న గ్రామస్తులు

మానకొండూర్: రాత్రింబవళ్లు మిషనరీలతో బండరాళ్లు పగలగొడుతూ, బ్లాస్టింగులు చేస్తుండటంతో ఇబ్బందులు పడుతున్నామని మండలంలోని పెద్దూర్ పల్లెగ్రామస్తులు మంగళవారం టిప్పర్లను అడ్డుకుని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్య పరిష్కారమయ్యేంత వరకూ టిప్పర్లను వెళ్లనిచ్చేది లేదని మండిపడ్డారు. చెంజర్ల రెవెన్యూ శివారులోని కొండెగల గుట్ట నుంచి గ్రానైట్ తీయగా, మిగిలిన వేస్టేజ్ రాయిని డీబీఎల్ కంపెనీ టిప్పర్ల ద్వారా నేషనల్ హైవే పనులకు నిత్యం తరలిస్తున్నారు. శబ్ద కాలుష్యంతో గ్రామస్తులకు నిద్ర లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బ్లాస్టింగు కారణంగా పంట పొలాల్లో బండరాళ్లు పడటంతో నష్టపోతున్నామని, శబ్ద, వాయుకాలుష్యం ఏర్పడుతుందని, తారురోడ్డు పగుళ్లు బారి అధ్వాన్నంగా మారుతుందని ఆరోపించారు. నాలుగు నెలల క్రితమే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆరోపించారు. రాత్రి వేళల్లో పనులు బంద్ చేయాలని డిమాండ్ చేశారు.

కారు ఢీకొని దంపతులకు తీవ్రగాయాలు



కారు బానట్‌పై పడిన పోశయ్య, గాలిలో ఎగిరి తలకిందులుగా పడుతున్న మల్లవ్వ

చందుర్తి(వేములవాడ): కారు అతి వేగానికి ద్విచక్ర వాహనంపై వెళ్తున్న దంపతులు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల కథనం ప్రకారం.. రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం కట్టలింగంపేట గ్రామానికి చెందిన మల్లారపు పోశయ్య– మల్లవ్వ దంపతులు. మంగళవారం పొలం వద్దకు వెళ్లి ఇంటికి తిరిగి వస్తున్న క్రమంలో కట్టలింగంపేట బస్టాండ్ సమీపంలో రుద్రంగి నుంచి వేములవాడ వైపు వెళ్తున్న కారు అతివేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో పోశయ్య ఎగిరి కారు బానట్‌పై పడగా, మల్లవ్వ గాలిలో లేచి తలకిందులుగా కిందపడింది. దంపతులిద్దరినీ కరీంనగర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మల్లవ్వ పరిస్థితి విషమంగా ఉన్నట్లు డాక్టర్లు పేర్కొన్నారు. కారు అతివేగమే ప్రమాదనికి కారణమని స్థానికులు తెలిపారు. ఈ ఘటనపై ఇంకా కేసు నమోదు కాలేదు.

ఆటోడ్రైవర్‌కు రిమాండ్



నిందితుడి అరెస్టు చూపుతున్న సీఐ కృష్ణకుమార్

వేములవాడరూరల్: వేములవాడ రూరల్ మండలం పోచెట్టిపల్లి వద్ద జరిగిన ఆటో ప్రమాదంలో ఇద్దరి మృతికి కారణమైన నిందితుడు చింతల్‌ఠాణా గ్రామానికి చెందిన ఆటోడ్రైవర్ రాజును మంగళవారం రిమాండ్‌కు తరలించినట్లు వేములవాడ రూరల్ సీఐ వై.కృష్ణకుమార్ తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన లేకపోవడం, డ్రైవింగ్‌లో నిర్ణీత వేగాన్ని పాటించకపోవడం వల్లే ప్రమాదాలు జరుగుతున్నట్లు సీఐ పేర్కొన్నారు. వాహనదారులు డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్, రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్స్ ఇతర పత్రాలు కలిగి ఉండాలన్నారు.